ఏలూరు ఎఎస్‌పిగా స్వరూపరాణి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు జిల్లా ఎఎస్‌పిగా జి.స్వరూపరాణి నియమితులయ్యారు. ఈ మేరకు డిజిపి ఉత్తర్వులు విడుదల చేశారు. ఇక్కడ ఎఎస్‌పిగా పని చేస్తున్న ఎంజెవి భాస్కర్‌రావు కాకినాడ ఎఎస్‌పిగా నియమితులయ్యారు. ఇక్కడ ఎఎస్‌పిగా నియమితులైన స్వరూపరాణి రాజమండ్రి నుంచి బదిలీపై వచ్చారు. అలాగే ఏలూరు జిల్లా ఎస్‌సి, ఎస్‌టి సెల్ విభాగంలో పని చేస్తున్న ఉమామహేశ్వరరావు శ్రీకాకుళం జిల్లా ఎఎస్‌పిగా నియమితులయ్యారు.

నిర్మలమ్మ పద్దు పలికేనా..!

పోలవరం నిర్వాసితుల కన్నీటి వ్యథలు.. వేతన జీవుల ఆదాయపు పన్ను కష్టాలు.. కర్షకుల కన్నీటి వేదన, జిల్లాలోని కేంద్రీయ విద్యాసంస్థ నిట్, కొవ్వూరు - భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లోనైనా నిధుల కేటాయింపు జరిగేనా అంటూ జిల్లా ప్రజానీకంలో విస్తృత చర్చ సాగుతోంది. మోడీ సర్కార్ ఎన్నికల వేళ ప్రవేశ పెడుతున్న బడ్జెట్‌లోనైనా జిల్లాకు న్యాయం జరిగేనా, లేదా అనేది వేచిచూడాలి.

- నేడు పార్లమెంట్‌లో కేంద్ర బడ్జెట్
- పునరావాసానికి నిధులిస్తేనే పోలవరం నిర్వాసితులకు మేలు
- రైల్వేలైన్లకు నిధుల కేటాయింపు ఉండేనా
- కష్టాల కడలిలో వ్యవసాయ, ఆక్వా సాగు
- ఆదాయపు పన్ను శ్లాబుల పెంపుపై వేతన జీవుల ఎదురుచూపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం గురువారం పార్లమెంట్‌లో ఎన్నికల వేళ ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. నిబంధనల ప్రకారం వచ్చే మూడు నెలల ఖర్చుకు సంబంధించి మాత్రమే ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్‌లో ప్రస్తావించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో గెలిచిన పార్టీ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేశాక పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. గత పరిణామాలు పరిశీలిస్తే మోడీ సర్కార్ ఈ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చేసింది. ఎన్నికల వేళ జరగనున్న బడ్జెట్‌లోనైనా జిల్లాలోని కేంద్ర ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరిగేనా అనే చర్చ నడుస్తోంది. కేంద్రం పరిధిలోని పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై ప్రతి బడ్జెట్‌లోనూ నిరాశే మిగులుతోంది. పోలవరానికి నిధుల కేటాయింపులు లేకపోవడంతో నిర్వాసితులకు పరిహారం అందని పరిస్థితి నెలకొంది. పోలవరానికి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించినప్పుడే నిర్వాసితులకు పరిహారం అందుతోంది. నిర్వాసితులకు రూ.32 వేల కోట్ల వరకూ పరిహారం ఇవ్వాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. కేంద్రం మాత్రం నిధులు ఇవ్వడం లేదు. దీంతో ఏలూరు జిల్లాలోనే 20 వేలకుపైగా నిర్వాసిత గిరిజన కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గోదావరి వరదల సమయంలో నిర్వాసితులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయిస్తారో లేదో వేచిచూడాలి.

నిట్‌కు నిధులిచ్చేనా..?

రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర విద్యాసంస్థ నిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) ఏర్పాటైంది. ఫేజ్-1 పనులు పూర్తయ్యాయి. ఇంకా అనేక పనులు చేయాల్సి ఉంది. అందుకోసం బడ్జెట్‌లో పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో నిట్ అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. నిట్‌కు శాశ్వత డైరెక్టర్‌ను కూడా నియమించకపోవడంతో విద్యాసంస్థ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిన పరిస్థితి ఉంది. ఈ బడ్జెట్‌లోనైనా నిట్‌కు పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తారో లేదో చూడాల్సి ఉంది.

రైల్వే లైన్లకు మోక్షం కలిగేనా..!

జిల్లాలో దశాబ్దాల నాటి కలగా కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైను ఉన్నాయి. ఏటా కొవ్వూరు-భద్రాచలం రైల్వేలైన్‌కు సంబంధించి తీవ్ర నిరాశ మిగలగా, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు అరకొర నిధుల కేటాయింపుతోనే సరిపెడుతున్నారు. దీంతో రైల్వే ప్రాజెక్టులు ముందుకు సాగని పరిస్థితి.

ఆదాయపు పన్ను పెంపుపై వేతన జీవుల ఎదురుచూపు

ఏడాదికి రూ.2.50 లక్షలుగా ఉన్న ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షలకు పెంచాలని వేతన జీవులు కోరుతున్నారు. వేతన జీవులు కోరిన విధంగా కాకుండా గత బడ్జెట్‌లో రూ.ఐదు లక్షల వరకూ ఆదాయపు పన్ను పరిమితిని కల్పిస్తున్నట్లు చెప్పి రూ.ఐదు లక్షల ఆదాయం దాటితే రూ.2.50 లక్షల నుంచి పన్ను చెల్లించాలని నిబంధన పెట్టింది. ఇది వేతన జీవులకు ఏమాత్రమూ ఊరట కలిగించలేదు. ఈ బడ్జెట్‌లోనైనా ఆదాయపు పన్ను పరిమితి రూ.ఐదు లక్షలకు పెంచాలని వేతనజీవులు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల వేళ వేతన జీవులకు ఊరటనిస్తారో, లేదో చూడాల్సి ఉంది.

ఆక్వా, వ్యవసాయ రంగాలకు ఊరట కలిగేనా?

జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు సాగుతోంది. ఆక్వా సాగుకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఏమాత్రం మద్దతు లేకుండాపోయింది. మేత ధరలు విపరీతంగా పెంచేసింది. ఆక్వాకు సంబంధించి ధర విషయంలో నిలకడలేని పరిస్థితి కొనసాగుతోంది. ఆక్వా పరిశ్రమను ప్రోత్సహించే విధంగా రాయితీలు కల్పిస్తూ బడ్జెట్‌లో పెట్టాలని ఆక్వారైతులు కోరుతున్నారు. జిల్లాలో అతిపెద్ద సాగు వరి. 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కాంప్లెక్స్ పురుగుమందుల ధర ఏకంగా బస్తా రూ.1700కు చేరింది. పురుగు మందుల ధరల పరిస్థితీ అదేవిధంగా ఉంది. ఎరువుల సబ్సిడీ ధరలు పెంచితే రైతులకు మేలు జరుగుతుంది. వ్యవసాయానికి వెన్నుదన్నులా నిలిచేలా వరికి మద్దతు ధర కల్పించాల్సి ఉంది. బడ్జెట్‌లో ఆక్వా, వరి, పామాయిల్ రైతులకు మేలు జరిగేలా చర్యలుంటాయో లేదో వేచిచూడాలి.

కంటితుడుపే..!

- డిఎస్‌సి విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం
- ఐదేళ్ల తర్వాత మళ్లీ డిఎస్‌సి
- ఉమ్మడి జిల్లాలో భర్తీ చేసేది 150లోపు పోస్టులే
- 117 జిఒతో తగ్గిపోయిన పోస్టులు
- ఉపాధ్యాయ అభ్యర్థుల్లో తీవ్ర నిరాశ

ప్రజాశక్తి - భీమవరం

ఎట్టకేలకు డిఎస్‌సి విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అయితే ఇది ఎన్నికల ముందు కేవలం కంటి తుడుపు చర్యగా ఉపాధ్యాయ అభ్యర్థులు అభివర్ణిస్తున్నారు. 117 జిఒతో జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు బాగా తగ్గిపోయాయి. 800 వరకూ భర్తీ కావాల్సిన పోస్టులు ప్రస్తుత డిఎస్‌సిలో కేవలం ఐదు వందలలోపు మాత్రమే భర్తీ కానున్నాయి. దీంతో డిఎస్‌సి కోసం ఐదేళ్లుగా నిరీక్షిస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థులకు తీవ్ర నిరాశే మిగిలింది. 2018 తర్వాత మళ్లీ ఇప్పుడే డిఎస్‌సి విడుదలకు ఆమోదం తెలపడం ఎన్నికల నేపథ్యమేననే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఉపాధ్యాయ అభ్యర్థులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న డిఎస్‌సి విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2018 తర్వాత ఐదేళ్లకు డిఎస్‌సి విడుదలకు ఆమోదం లభించిందని తెలియగానే ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అయితే పోస్టుల సంఖ్య చూడగానే అభ్యర్థుల ఆనందమంతా ఆవిరైంది. ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒతో ఉపాధ్యాయ కొలువులు పెద్దసంఖ్యలో తగ్గిపోయాయి. ఈ జిఒ విడుదల కాకముందు ఉమ్మడి జిల్లాలో సుమారు ఎనిమిది వందల పోస్టుల వరకూ ఖాళీలు ఉన్నాయి. ఈ జిఒ వచ్చిన తర్వాత పోస్టులు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన డిఎస్‌సిలో ఉమ్మడి జిల్లాకు సంబంధించి కేవలం 150లోపు పోస్టులు మాత్రమే భర్తీ కానున్నాయి. తెలుగు సబ్జెక్ట్ పోస్టులు 20, స్పెషల్ ఎడ్యుకేషన్ 6, సాంఘికశాస్త్రం 4, సంస్కృతం 3, బిఎస్ 4, ఇంగ్లీష్ 7, హిందీ 41, గణితం 4, పిఇ 53, పిఎస్ 4 పోస్టులు భర్తీ చేయనున్నటఉల ఒక అంచనా. ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. జిఒ 117 తీవ్ర నష్టం చేకూర్చిందని, ఫలితంగా పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని చెబుతున్నారు. ఎన్నోఏళ్ల నుంచి ఉపాధ్యాయ కొలువుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు ఎన్నికల ముందు హడావిడిగా అరకొర పోస్టులతో డిఎస్‌సి విడుదలకు కేబినెట్ ఆమోద ముద్ర వేయడంపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

117 జిఒతో ఎస్‌జిటి పోస్టులు నిల్

ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒతో ఉమ్మడి జిల్లాలో ఎస్‌జిటి పోస్టులు కనుమరుగయ్యాయి. ప్రభుత్వ నిబంధనలతో కనీసం ఒక్క పోస్ట్ కూడా లేకుండాపోయింది. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మిగులు జాబితాలో సుమారు 220 మంది ఉన్నారు. ఇక మిగిలింది కేవలం 150లోపు ఖాళీలు మాత్రమే. అయితే ఆరేళ్ల తర్వాత డిఎస్‌సి నిర్వహిస్తుండగా సుమారు 600 నుంచి 700కుపైగా కొలువుల్ని భర్తీ చేయాల్సి ఉంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానం ఫలితంగా కేవలం 150లోపు పోస్టులు మాత్రమే భర్తీ చేయనున్నారు.

నిరుద్యోగులకూ శాపంగా నూతన విద్యావిధానం

నూతన విద్య విధానం పేరుతో చేపట్టిన సంస్కరణలు నిరుద్యోగులకు శాపంగా మారాయి. ఇప్పటి వరకూ ప్రభుత్వ పాఠశాలలు మూతపడగా ఉపాధ్యాయ పోస్టులు సైతం కనుమరుగువుతున్న పరిస్థితి ప్రస్తుత డిఎస్‌సిలో తేటతెల్లమైంది. 3, 4, 5 తరగతులను సమీప పాఠశాలలో విలీనం చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ కొలువులు కేటాయించకుండా తరగతులవారీ కేటాయించారు. హేతుబద్ధీకరణ ప్రక్రియలో పదో తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులకు మాత్రమే తెలుగు, ఆంగ్లం మాధ్యమాల ప్రకారం వేర్వేరుగా స్థాన చలనం కల్పించారు. ఒకటి నుంచి తొమ్మిది తరగతుల వారిని ఒక మాధ్యమం ప్రకారం మార్చారు. అలాగే ఉద్యోగోన్నతుల విషయంలోనూ కనీస నిబంధనలు పాటించలేదు. ఖాళీగా ఉన్న పోస్టులను 70 శాతం వరకు ఉద్యోగోన్నతులతో భర్తీ చేసి మిగిలిన 30 శాతం పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలి. అయితే దానికి భిన్నంగా అన్ని ఖాళీలను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేశారు. దీంతో పరిస్థితి తారుమారైంది. ఉపాధ్యాయ అభ్యర్థులు జిల్లాలో వేలల్లో ఉన్నప్పటికీ వందల్లోనూ పోస్టుల భర్తీ చేసే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్ర నిరాశ, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

30 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి ప్రకటించాలి

బి.గోపీమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి

కేవలం ఆరు వేల పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి అని పేరు పెట్టడం విడ్డూరంగా ఉంది. 117 జిఒ రాక ముందు 23 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉద్యోగ విరమణ పొందిన వారితో కలిపి సుమారు 30 వేల వరకు ఉన్నాయి. 117 జిఒను రద్దు చేసి 30 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి విడుదల చేయాలి. ఎన్నికల వేళ నిరుద్యోగులకు కంటితుడుపు చర్యగా డిఎస్‌సి ప్రకటనకు కేబినెట్ ఆమోదం తెలపడం సిగ్గుచేటు.

నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం

కె.ధనుష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

డిఎస్‌సి విడుదలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం హర్షణీయం. నిరుద్యోగులకు మాత్రం తీవ్ర అన్యాయం జరిగింది. నూతన విద్యా సంస్కరణలతో ఉపాధ్యాయ కొలువుల పోస్టులు విపరీతంగా తగ్గిపోయాయి. జిల్లాలో అనేక మంది నిరుద్యోగులు ఉన్నారు. కేవలం కంటితుడుపు చర్యగా అరొకర పోస్టులతో డిఎస్‌సి విడుదలకు ఆమోదం తెలపడం అత్యంత దారుణం. ప్రభుత్వం పునరాలోచించి మెగా డిఎస్‌సి ప్రకటించాలి.

మద్య నిషేధం మరిచారు.. కల్లుగీతను నిషేధిస్తున్నారు



నినదిస్తున్న నేతలు, ప్రతినిధులు

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ఎన్నికల్లో గీతన్నల సత్తా చూపుతాం

కల్లుగీత కార్మిక సంఘం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు

ముగిసిన 15వ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - తణుకు రూరల్

ప్రజల ప్రాణాలు హరించడంతోపాటు కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మద్యాన్ని ఏరులైపారిస్తున్న ప్రభుత్వం కల్లుగీత వృత్తిని నిర్వీర్యం చేసే విధానాలను అవలంబిస్తూ అప్రకటిత నిషేధం విధిస్తోందని పలువురు వక్తలు విమర్శించారు. ఎపి కల్లుగీత కార్మిక సంఘం 15వ రాష్ట్ర మహాసభ కీర్తిశేషులు చిటకన వెంకటేశ్వరరావు నగర్‌లో రెండో రోజు బుధవారం ఉత్సాహపూరితంగా సాగింది. రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల నుంచి సుమారు 250 మంది గీత కార్మికులు ప్రతినిధులుగా హాజరయ్యారు. పలువురు వక్తలు మాట్లాడుతూ గీతవృత్తిని నాశనం చేయాలని చూస్తే రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తమ సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికగా సంఘ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి ఆవిష్కరించారు. అనంతరం కీర్తిశేషులు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, ఉద్యమ నిర్మాత ఎస్ఆర్.దాట్ల, చిటకన వెంకటేశ్వరరావు, అమరులకు ప్రతినిధులు నివాళులర్పించారు. ఈ మహాసభకు అధ్యక్షవర్గంగా జుత్తిగ నరసింహమూర్తి, కామన మునిస్వామి, గుబ్బల నాగమణి, స్టీరింగ్ కమిటీగా యర్రా దేముడు, ఎం.స్టాలిన్ వ్యవహరించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉభయగోదావరి జిల్లాల పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గీత కార్మికుల బతుకులు మరింత దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఐదేళ్లలో 200 మంది గీతన్నలు చనిపోయారని, మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా చెల్లించలేదని విమర్శించారు. పాక్షిక అంగవైకల్యం, శాశ్వత అంగవైకల్యానికి రూ.50 వేలు చెల్లించాల్సి ఉండగా అతీగతీ లేదన్నారు. కల్లు గీత కార్మికుల కార్పొరేషన్ మూసివేసి ఐదు కులాల కార్పొరేషన్లు పెట్టిన ప్రభుత్వం గీత కార్మికులకు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. చెట్లకు ఉన్న మార్కింగ్ తీసేసి చెట్లను నరికేస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లుగీత కార్మికులకు ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం ఏమిటని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం వచ్చినా మనల్ని, మన సంపదను దోచుకుంటున్నారని, అడిగితే కాదని.. పోరాడితేనే మన సమస్యలను పరిష్కరించుకోగలమని పిలుపునిచ్చారు. ఒకవైపు రాష్ట్రంలో అన్ని రంగాల ఉద్యోగులు తమ జీతాలు పెంచమని పోరాడుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లకు ఒకసారి మాత్రమే జీతాలు పెంచుతామని చెప్పే ప్రభుత్వం ఐదేళ్లకు ఒక్కసారి మాత్రమే నిత్యావసరాల ధరలు పెంచగలరా అని ప్రశ్నించారు. కల్లుగీత కార్మికులకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. పక్క తెలుగు రాష్ట్రమైన తెలంగాణలో చనిపోయిన వారికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నారని, ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. నీరా ప్రాజెక్టుకు రూ.25 కోట్లు కేటాయించి వృత్తి రక్షణ కల్పిస్తుంటే జగన్ ప్రభుత్వం వీటిలో ఏఒక్కటీ అమలు చేయకుండా కల్లుగీత కార్మికులకు అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన వారందరికీ తక్షణం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గాయాలు పాలైన వారికి నష్టపరిహారం చెల్లించాలని, నీరా ప్రాజెక్ట్ అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఐక్యతను దెబ్బతీసే కార్పొరేషన్ల వల్ల ఒరిగిందేమీ లేదు

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ

ప్రతినిధులనుద్దేశించి కల్లుగీతకార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎంవి.రమణ మాట్లాడుతూ రాష్ట్రాలు వేరైనా, పాలకులు మారినా గీత కార్మికుల కష్టాలు మాత్రం తీరడం లేదన్నారు. తరతరాలుగా ఉపాధి కోసం చెట్లెక్కి ప్రమాదంలో చనిపోతే ఎక్స్‌గ్రేషియా ఇవ్వకపోవడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్మభిక్షం, ఎస్ఆర్.దాట్ల నాయకత్వాన అన్ని కులాల్లో ఉన్న గీత కార్మికులను ఐక్యం చేసి నిర్మించుకున్నదే ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం అని తెలిపారు. భూస్వాములకు, ఎక్సైజ్ అక్రమ దాడులకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత సంఘానికి ఉందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను వైసిపి ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. ఓట్లు కోసం కార్పొరేషన్లు పెట్టి గీతన్నల ఐక్యతను జగన్ విచ్ఛిన్నం చేశాడని దుయ్యబట్టారు.

ఎన్నికల్లో గీతన్నల సత్తా ఏమిటో చూపిస్తాం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు

రానున్న ఎన్నికల్లో గీతన్నల సత్తా ఏమిటో చూపిస్తామని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా దేముడు స్పష్టం చేశారు. ఆయన కార్యదర్శి నివేదిక ప్రవేశపెడుతూ ఐక్యంగా ఉన్న వృత్తిదారులను కులాలవారీగా విడదీసిన ఘనత వైసిపిదేనన్నారు. ఐదేళ్లు అవుతున్నా గీత పాలసీ అమలు చేయలేని ఘనత ఈ ప్రభుత్వ సొంతమన్నారు. అనంతరం ఉద్యమ సీనియర్ నాయకులు, అతిథులను ఎంఎల్‌సి ఐవి చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, ప్రొఫెసర్ జుత్తిగ చంద్రప్రసాద్, మట్టా వెంకట్, రాష్ట్ర నాయకులు సిమ్మ అప్పారావు, బత్తిన నాగేశ్వరరావు, జిల్లా నాయకులు బొక్కా చంటి, కడలి పాండు, గుబ్బల వీరరాఘవులు, మామిడిశెట్టి నాగభూషణం పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్షలను స్థానిక కలెక్టరేట్ వద్ద బుధవారం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఆలీ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని మొదటి దఫా పోరాటంలో వినతులు, ధర్నాలు నిర్వహించామన్నారు. ఆ పోరాట ఫలితంగా జనవరిలో ఒకటి, రెండు తేదీల్లోనే జీతాలు వచ్చాయని, పిఎఫ్ లోన్లు కూడా మంజూరయ్యాయని తెలిపారు. ఎపిజిఎల్ఐ లోన్లు, సరెండర్ లీవులు, డిఎ ఎరియర్లు, పిఆర్‌సి ఎరియర్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఆ బకాయిల కోసం నాలుగు రోజులపాటు రిలే దీక్షలు నిర్వహించనున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల బకాయిలు పూర్తిగా చెల్లించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఏ పార్టీ అయితే పాత పెన్షన్ విధానాన్ని తన మేనిఫెస్టోలో ప్రకటిస్తుందో, గెలిచిన తర్వాత మొదటి సంతకంగా పాత పెన్షన్ అమలు చేస్తూ పెడుతుందో ఆ పార్టీకే ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందన్నారు. దీక్షలో నేతలు ఎంవి.శ్యాంబాబు, జి.వెంకటేశ్వరరావు, వి.కనకదుర్గ, జివి.రంగమోహన్, పివి.సాగర్‌బాబు, కె.కమల్‌కుమార్, సుధారాణి, పివి.నర్సింహారావు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతులకు, వ్యవసాయ కార్మికులకు, దళితులకు, గిరిజనులకు, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే భూ యాజమాన్య హక్కుల చట్టం - అసైన్డ్ భూముల చట్ట సవరణను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అఖిల పక్ష రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక, ప్రజాసంఘాలు, న్యాయవాద సంఘాల ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఒ.శైలజ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే తదితరులు మాట్లాడారు. భూ యాజమాన్య హక్కుల చట్టంలో రైతులకు, ప్రజలకు నష్టం కలిగించే అత్యంత ప్రమాదకర నిబంధనలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములు, నివాస స్థలాలు, భవనాలు తదితర అన్ని రకాల స్థిరాస్తులపై హక్కులను నిర్ధారించి టైటిల్ రిజిస్టర్లు నమోదు చేసే అధికారాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించడం వల్ల రాజకీయ నాయకుల జోక్యం పెరిగి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడతారని చెప్పారు. ఈ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర భూ సర్వేలో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాజ్యాంగ వ్యతిరేక, ప్రజావ్యతిరేక చట్టాలు రద్దు చేయకపోతే రానున్న ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బి.సోమయ్య, పి.కన్నబాబు, కడుపు కన్నయ్య, కోనా శ్రీనివాసరావు, పంతగాని ఆనందం, సిహెచ్ మణి, డి.నాగేంద్ర పాల్గొన్నారు.

ధర్నాలో నినదిస్తున్న నేతలు, ప్రజలు

కొనసాగిన సెర్ప్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సోమయ్య

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర సెర్ఫ్ ఉద్యోగుల జెఎసి ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మె ఎనిమిదో రోజు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా శిబిరాన్ని సందర్శించిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ సెర్ఫ్ ఉద్యోగుల పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించి వారికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. జెఎసి జిల్లా ఛైర్మన్ సిహెచ్ సుబ్బారావు మాట్లాడుతూ కేడర్లు, పేస్కేల్ సక్రమంగా నిర్ణయించి ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలన్నారు. ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ద్వారా ఉద్యోగుల సేవలు క్రమబద్ధీకరించడానికి మంజూరు చేయబడిన పోస్టులపై వెంటనే జిఒ ఇవ్వాలని, ప్రస్తుత సీలింగ్ విధానానికి బదులుగా 100 శాతం బేసిక్‌పై ఇపిఎఫ్ కాంట్రిబ్యూషన్ అమలు చేయాలని, రిజర్వేషన్ల నియమాన్ని సక్రమంగా వర్తింపజేస్తూ అర్హత కలిగిన ఉద్యోగులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామక పథకం అమలు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి మెంబర్ కన్వీనర్ హేమంత్ కుమార్, కన్వీనర్ బాపూజీ, గోపి, అనిత, లతా, విజయ కుమారి పాల్గొన్నారు.

సొసైటీలకు ధాన్యం కమీషన్ అందించాలి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు: జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి పూర్తి కమీషన్ సొసైటీలకు అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారిని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. బుధవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సలహా మండలి సమావేశంలో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ప్రచురించిన చిరు ధాన్యాలతో రుచికరమైన వంద రకాల వంటలు పుస్తకాన్ని జెడ్‌పి ఛైర్‌పర్సన్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కమీషన్ ఎఫ్‌డి చేసే నిబంధన సడలించి సొసైటీలు గోనె సంచులు కొనుగోలు చేసుకునే వీలుగా కమీషన్ పూర్తిగా సొసైటీలకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న పాలవెల్లువకు సంబంధించి ద్వారకాతిరుమల, దెందులూరు తదితర మండలాల్లో పిఎంఇజిపి కింద యూనిట్ల స్థాపనకు లబ్ధిదారులు 10 రోజుల్లోగా దరఖాస్తులు చేసేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్థకశాఖ అధికారులను ఆదేశించారు. రుణాల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత బ్యాంకర్లతో సంప్రదించాలని ఎల్‌డిఎంను కలెక్టర్ ఆదేశించారు. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరంలో 100 ఎకరాల చిన్న, పెద్ద చెరువులకు సంబంధించి సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆర్‌డిఒ, తహశీల్దారును ఆదేశించారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ కాలువలు, డ్రెయిన్‌లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు, తదితర పలు అంశాలపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో పశ్చిమ డెల్టాకు సంబంధించి షట్టర్లకు మరమ్మతులు, ఉంగుటూరు నియోజకవర్గంలో కాలువలు, డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చింతలపూడిలో పెత్తందారీ వ్యవస్థ

ఎంఎల్ఎ ఎలిజా

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ నడుస్తుందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. ఆయన ఒక ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం భారత రాజ్యాంగం ప్రకారం ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధిని కాదని రోడ్లు ఎలా ప్రారంభిస్తారని, ప్రజాస్వామ్యాన్ని అపహాసం చేస్తున్నారని మండిపడ్డారు. కనీసం సమాచారం ఇవ్వకుండా జంగారెడ్డిగూడెం, కామవరపుకోట మండలంలో రోడ్లు ప్రజా ప్రతినిధులు లేకుండా ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. రోడ్ల నిర్మాణానికి పార్టీ పెద్దల వద్దకు తిరిగి నిధులు తీసుకువచ్చిన ఎంఎల్ఎని కాదని, ఏ ప్రోటోకాల్ ప్రకారం రోడ్లు ప్రారంభిస్తున్నారని ప్రశ్నించారు. దళిత ఎంఎల్ఎలు అంటే చులకనగా చూస్తున్నారని తెలిపారు.

ఎన్నికల సామగ్రి గోదాం తనిఖీ : కలెక్టర్

ఏలూరు : ఏలూరు జిల్లాకు సంబంధించి ఎన్నికల సామగ్రిని భద్రపర్చే గోదామును ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీలో భాగంగా పరిశీలించినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ఉన్న ఇవిఎం యం త్రాలు, వివిప్యాట్ భద్రపర్చే గోదామును సందర్శించి దానికి వేసిన సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అలాగే ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్‌లో కలెక్టర సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఇవిఎం, వివిప్యాట్ గోదామును క్షుణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఇవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా హేమామాలిని

నూజివీడు రూరల్: నూజివీడు మున్సిపల్ కమిషనర్‌గా హేమామాలిని బుధవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలో భాగంగా ఇప్పటి వరకూ ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సయ్యద్ అబ్దుల్ రషీద్ బదిలీ కావడంతో మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి హేమామాలిని నూజివీడుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రభుత్వ పథకాలు అందరికీ చేరే విధంగా చూడడమే తన లక్ష్యమని తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రెడ్‌క్రాస్‌కు ల్యూకోసైట్ ఫిల్టర్ సెట్‌ల అందజేత

ఏలూరు అర్బన్: తలసేమియా రోగుల రక్తమార్పిడి సమయంలో ఉపయోగించే లక్ష రూపాయల విలువ గల ల్యూకోసైట్ ఫిల్టర్ సెట్‌లను ఏలూరు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు బుధవారం రెడ్‌క్రాస్ ప్రతినిధులకు అందజేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తమార్పిడి సమయంలో తలసేమియా రోగులకు ఎటువంటి ప్రతి చర్యలు సంభవించకుండా ఉపయోగించే ప్రత్యేకమైన ఫిల్టర్ సెట్‌లకు దాతల సహకారం కోరగా, ఏలూరు కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వారు స్పందించి 125 ఫిల్టర్ సెట్‌లను అందించారని, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు, సీనియర్ అసిస్టెంట్ ఎ.సూర్యనారాయణ, జిల్లా రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ వి.నాగరాజు పాల్గొన్నారు.

ఆదర్శ రాజేంద్రన్‌కు వీణ బహూకరణ

నూజివీడు రూరల్: నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు రెవెన్యూ డివిజన్ పరిధిలోని సిబ్బంది బుధవారం వీణను బహూకరించారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ నెల్లూరు జిల్లాకు బదిలీ కావడంతో రెవెన్యూ డివిజన్ పరిధిలోని సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ డివిజన్ పరిధిలోని సిబ్బందితో కాసేపు ముచ్చటించారు. ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో ఉన్నతాధికారుల ప్రశంసలు పొందాలని ఆయన సూచించారు.

పులి సంచారంతో అప్రమత్తత : విఆర్‌ఒ

కొయ్యలగూడెం : పొంగుటూరు, రాజవరం పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు పులి తిరుగుతుందన్న సమాచారం మేరకు అప్రమత్తంగా ఉండాలని కొయ్యలగూడెం ఎంఆర్‌ఒ ఆదేశానుసారం విఆర్‌ఒ బుధవారం ప్రకటన జారీ చేశారు. పొలాలకు వెళ్లేటప్పుడు ఎక్కువ మంది వుండేటట్లు చూసుకోవాలని, పులి గురించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే తెలపాలని సూచించారు.

ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించాలి

ఆదివాసీ గిరిజన సంఘం

బుట్టాయగూడెం: రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించకపోవడం పట్ల ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ తెలిపారు. తక్షణమే ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తుందన్నారు. బుధవారం ఆదివాసి విజ్ఞాన కేంద్రం గిరిజన సంఘం భవన్‌లో తెల్లం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ వైసిపి గత ఎన్నికల హామీలో ప్రతి ఏడాది జనవరిలో మెగా డిఎస్‌సి ప్రకటిస్తానని వాగ్దానం చేసి ఐదేళ్ళు గడుస్తున్నా అమలు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 వేలు టీచర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని, 40 వేల పోస్టులు తియ్యకుండా . కేవలం 6,100 పోస్టులు ప్రకటించడాన్నారు. స్పెషల్ డిఎస్‌సి తీసుకుంటా ఆదివాసి నిరుద్యోగులకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని తెలియజేశారు.

ఆరోగ్య సురక్ష సేవలు వినియోగించుకోవాలి

ఏలూరు టౌన్: ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య సేవలను నగర ప్రజలు ఉపయోగించుకోవాలని 23వ డివిజన్ కార్పొరేటర్ కల్యాణ్ సాంబశివరావు, అడిషనల్ కమిషనర్ హెచ్ వి.బాబీరావు సూచించారు. స్థానిక ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నరసింహారావు పేటలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు ఉచితంగా పరీక్షించి అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఇసిజి, షుగర్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగానే మందులు, అవసరమైన వారికి ఉచితంగానే శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని, కాబట్టి ప్రతిఒక్కరూ వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష బ్యాగులను, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ ప్రగతి, అసిస్టెంట్ మలేరియా అధికారి ఆర్.గోవిందరావు, హెల్త్ సూపర్‌వైజర్ హేమ, సచివాలయం అడ్మిన్ పాతూరి శ్రీకాంత్, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రియుడు మోసం.. యువతి ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రేమించానని మాయమాటలు చెప్పి గర్భవతిని చేసి, పెళ్లికి నిరాకరించడంతో ఓ యువతి ఆ యువకుడి ఇంటి ముందు ధర్నాకు దిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువతి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బైటాన్ నగరకు చెందిన పి.దివ్య డిగ్రీ చదువుకుంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు, ఇతను చదువుతూ ఉండేవారు. ఈక్రమంలోనే ప్రేమ పేరుతో లోబర్చుకుని శారీరకంగా అనుభవించాడని, గర్భం దాల్చాననీ మందులు ఇచ్చి గర్భం పోయేలా చేశాడని, నాకు న్యాయం చేయాలని వివాహం చేసుకోవాలని యువతి డిమాండ్ చేసింది. యువకుడి ఇంటి ముందు కూర్చుని ధర్నా చేపట్టి న్యాయం చేయాలని కోరింది. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఆ యువతికి ఇప్పటికే వివాహమైందని, ఓ బిడ్డ కూడా కందని, ప్రస్తుతం భర్తను విడిచిపెట్టి విడిగా ఉంటుందని, బెదిరింపులకు పాల్పడి డబ్బులు గుంజాలని ఆలోచన చేస్తున్నారని యువకుడి బంధువులు, స్థానికులు చెబుతున్నారు.

సారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

అక్రమంగా సారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి నూజివీడు సబ్ జైలుకు పంపినట్లు ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చెక్కపల్లి గ్రామంలో పలగాని శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇంటి వద్ద అక్రమంగా సారా అమ్ముతున్న సమయంలో ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి దాడి చేసి ప్యాకెట్లలో ఉన్న ఆరు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి నూజివీడు సబ్ జైలుకు పంపినట్లు తెలియజేశారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మట్టి తవ్వకాలు అడ్డుకున్నారని దాడి

కలెక్టర్‌కు టిడిపి నేతల ఫిర్యాదు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నేతలు

పెదవేగి మండలం లక్ష్మీపురంలో మంగళవారం రాత్రి రెండు రాజకీయ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. పోలవరం కాలువ మట్టి తరలింపు సమాచారం తెలుసుకున్న కొంతమంది మట్టి తరలింపును అడ్డుకోవడంతో రెండు వర్గాల మధ్య వివాదం రేగి ఒకరిపై ఒకరు ఢీ అంటే ఢీ అంటూ దాడులు చేసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే టిడిపి వర్గం కథనం ప్రకారం పెదవేగి మండలం లక్ష్మీపురంలో యధేచ్చగా జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలను మంగళవారం రాత్రి తన అనుచరులతో కలిసి దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అడ్డుకోగా చింతమనేని రాకతో లోడింగ్ పాయింట్ వద్దే టిప్పర్లు, జేసిబిలు వదిలి గ్రావెల్ మాఫియా పరారైనట్లు తెలుస్తుంది. దీంతో అక్రమ గ్రావెల్ తవ్వకాలపై ఆర్‌డిఒకు సమాచారం ఇచ్చి చర్యలు తీసుకోవాలని చెప్పి చింతమనేని ప్రభాకర్ వెళ్లిపోయినట్లు, అనంతరం ఘటనా ప్రాంతానికి చేరుకున్న పెదవేగి ఎస్ఐ స్వామి, రెవెన్యూ శాఖ సిబ్బంది వివరాలు నమోదు చేసినట్లు తెలిసింది. చింతమనేని వెళ్లిపోయారనే సమాచారం అందుకున్న వెంటనే ఒక్కసారిగా దూసుకొచ్చిన సుమారు 300 మంది వైసిపి వర్గీయులు పోలీసులు వివరాలు నమోదు చేస్తూ ఉండగానే, పోలీసుల సమక్షంలోనే ఘటనా ప్రాంతంలో ఉన్న టిడిపి నాయకులు, చింతమనేని అనుచరులపై కర్రలు, రాడ్లతో పైశాచిక దాడి చేశారని, టిడిపి సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ సహా పలువురు నాయకులపై కర్రలతో మూకుమ్మడి దాడి చేసి కార్లు ధ్వంసం చేశారని, పోలీసులు చోద్యం చూస్తూ నిలుచున్నారని టిడిపి వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఘటనా ప్రాంతంలో జెడ్‌పి ఛైర్మన్ భర్త ఘంటా ప్రసాద్, వైసిపి నాయకులు కామిరెడ్డి నాని సహా పలువురు వైసిపి నాయకులు ఉన్నారంటున్నారు. వైసిపి వర్గీయుల కథనం ప్రకారం పోలవరం గట్టు మట్టిని జిల్లా అధికారుల అనుమతితో దెందులూరు పరిధిలో బైపాస్ పక్కన దెందులూరు నియోజకవర్గ వైసిపి కార్యకర్తల సన్నాహక సమావేశ స్థలం చదును చేయడానికి తరలిస్తున్నట్లు, అక్రమంగా మట్టిని ఎవరూ తరలించడం లేదని తెలిపారు.

గత రాత్రి పెదవేగి మండలంలో పోలవరం కుడి కాలువ వద్ద జరిగిన అక్రమ గ్రావెల్ తవ్వకాలు, అడ్డుకున్న టిడిపి నాయకులపై వైసిపి అల్లరి మూకలు జరిపిన దాడులపై టిడిపి ప్రతినిధుల బృందం బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ సిఎం సభను సైతం తమ అక్రమాలకు వేదికగా దెందులూరు వైసిపి నాయకులు మార్చుకున్నారన్నారు. చింతమనేని ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ అక్రమ గ్రావెల్ తవ్వకాలు అడ్డుకున్నామనే అక్కసుతోనే స్థానిక ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి ఆధ్వర్యంలో వైసిపి అరాచక మూకలు తమ నాయకులపై దాడులు చేశారన్నారు. గాయపడిన టిడిపి నాయకులను ఆసుపత్రిలో గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

పొటెన్షియల్ లింక్‌డ్ క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పొటెన్షియల్ లింక్‌డ్ క్రెడిట్ ప్లాన్ జిల్లా ప్రగతికి సహకరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన పొటెన్షియల్ లింక్‌డ్ క్రెడిట్ ప్లాన్‌ను జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి పొటెన్షియల్ లింక్‌డ్ క్రెడిట్ ప్లాన్‌ను నాబార్డ్ డిడిఎం టి.అనిల్ కాంత్ రూపొందించిన జిల్లా పిఎల్‌పిను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రణాళికలో ప్రాధాన్యతా రంగానికి మొత్తం ప్రొజెక్షన్ రూ.16,243 కోట్లతో రూపొందించగా 2024-25లో మొత్తం వ్యవసాయ అంచనా రూ.11,273 కోట్లతో రూపొందించారన్నారు. మొత్తం వ్యవసాయంలో పంట రుణం రూ.6,306.29 కోట్లు కాగా వ్యవసాయ టర్మ్ లోన్ రూ.4,966.49 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయాలు రూ. 430.45 కోట్లు, అనుబంధ కార్యకలాపాలు రూ.7,508.93 కోట్లు కింద ఎంఎస్‌ఎంఇ రుణం కింద రూ.2,240.27 కోట్లగా అంచనా వేయబడిందన్నారు. ఎగుమతి క్రెడిట్ రూ.144.00 కోట్లు, విద్య కింద రూ.88.20.కోట్లు, హౌసింగ్ రూ.473.04 కోట్లు, బ్యాంక్ క్రెడిట్ రూ.44.22 కోట్లు, రెన్యూవబుల్ ఎనర్జీ రూ.13.37 కోట్లు, రూ. 27.50 కోట్లు కింద చూపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్‌పర్సన్ వెజ్జు వెంకటేశ్వర్ రావు, సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, నాబార్డు డిడిఎం టి.అనిల్ కాంత్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, డిడి హార్టికల్చర్ డిడి రామమోహన్ పాల్గొన్నారు.

ఓటర్ల తుది జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలి

ఏలూరు : ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే 4, 5 రోజుల్లో తెలియజేయాలని రాజకీయ పక్షాల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఎఒ రమాదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు డి.రత్నబాబు(బిఎస్‌పి), నెరుసు నెలరాజ(బిజెపి), పి.ఆదిశేషు(సిపిఎం), ఎస్.బాబూ ప్రసాద్(కాంగ్రెస్), ఆర్.సత్యనారాయణ(ఆమ్ ఆద్మీ), పాలి ప్రసాద్(టిడిపి), కలవకొల్లు సాంబ(వైసిపి) హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చివరి నిమిషం వరకు వేచిచూడకుండా బూత్ లెవల్ ఏజెంట్లతో తుది ఓటర్ల జాబితాతో ఆయా ఇళ్లను సందర్శించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యేవరకు రాజకీయ పక్షాల ప్రతినిధులతో ఓటర్ల జాబితా తదితర అంశాలపై వారం వారం సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

దోసపాడు పేదలకు న్యాయం చేయాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యాన డిఆర్‌ఒకు వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



వినతినిస్తున్న నాయకులు

దోసపాడు పేదలకు న్యాయం చేయాలని, అసైన్డ్ సీలింగ్ భూములపై సర్వే నిర్వహించి పేదలకు పంచాలని ప్రజా సంఘాల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో డిఆర్ఒ ఎన్.వెంకటేశ్వర్లుకి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ దోసపాడు దళితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. ఈ పోరాటం ప్రారంభమయ్యాక ముఖ్యమంత్రి రెండో దఫా దెందులూరు నియోజకవర్గంలో పర్యటించడం జరుగుతుందని, కాని దోసపాడు గ్రామంలో దళితులు, పేదలు ముఖ్యమంత్రికి కనబడట్లేదా అని ప్రశ్నించారు. దోసపాడులో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూములు విజయవాడకు చెందిన దేవినేని బాజీ ప్రసాద్, అయన కుటుంబీకులు, బినామీలు అక్రమంగా దౌర్జన్యం చేసి పేదల నుంచి భూములు చట్ట విరుద్ధంగా లాగేసుకున్నారని తెలిపారు. అనంతరం కిసాన్ సెల్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే మాట్లాడుతూ జిల్లాలో అసైన్మెంట్ భూములు దళితులకు చెందినవన్నారు. బినామీల పేరుతో భూములు ఆక్రమించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బదిలీ సాధారణమైనా.. అసంతృప్తి తప్పడం లేదు

ఎంపిడిఒల బదిలీ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో వక్తలు

ప్రజాశక్తి - చింతలపూడి



చింతలపూడి: ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డిని సన్మానిస్తూ..

ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, ప్రజాభిమానం, అధికారుల ప్రశంసలు, ప్రజా ప్రతినిధుల మన్ననలు పొంది, ఎన్నికల విధుల్లో భాగంగా బదిలీ కావటం సాధారణమైనప్పటికీ తమకు అసంతృప్తి తప్పడం లేదని చింతలపూడి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జానకి రెడ్డి అన్నారు. చింతలపూడి పట్టణంలో ఎంపిడిఒ మురళీకృష్ణ, ఇఒపిఆర్‌డి విక్టర్ బాబు తూర్పుగోదావరి జిల్లా బదిలీ అయిన సందర్భంగా ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి నీరజ సుధాకర్, మండల సంఘం అధ్యక్షులు కుమార్, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు : ఎంపిడిఒ పద్మావతి దేవి హయాంలో జిల్లా స్థాయిలో పలు ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభోత్సవం భీమడోలు మండలం నుంచే జరిగిందని, మండలానికి మంచి గుర్తింపు వచ్చిందని పలువురు కొనియాడారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీల కార్యక్రమం భీమడోలు మండలంలో ప్రారంభమైంది. దీనిలో భాగంగా భీమడోలు ఎంపిడిఒగా పనిచేస్తున్న చాగంటి పద్మావతి దేవి కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. వీరు తన బాధ్యతలను బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ పర్యవేక్షకులు జికె.అన్నపూర్ణకు అప్పగించారు. ఈ నేపథ్యంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది కట్టా రాజు, శ్రీనివాసరావు, అన్నపూర్ణ, ఇతర అధికారులు పద్మావతి దేవికి వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణలో రాష్ట్రస్థాయిలో భీమడోలు పంచాయతీకి ప్రత్యేక స్థానం, గుర్తింపు వచ్చాయన్నారు. అనంతరం పిడిఒ పద్మావతి దేవి మాట్లాడుతూ తన హయాంలో మండలం వివిధ అంశాలలో గుర్తింపు పొందటానికి జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగా, ఎంపిపి కనమాల రామయ్యతో పాటు మండల పరిషత్ యాజమాన్యం, సహచర అధికారులు సిబ్బంది అందజేసిన సహాయ సహకారాలు కారణంగా పేర్కొన్నారు.

ఎంపిడిఒ శంకర్రావు బదిలీ

ఆగిరిపల్లి: ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆగిరిపల్లి ఎంపిడిఒ పి.శంకరరావు గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు నెలల కాలంలో తమ విధి నిర్వహణలో ఆయనతో కలిసి పనిచేసిన అధికారులకు, సిబ్బందికి, పాత్రికేయ మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆగిరిపల్లి తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు కాకినాడకు బదిలీ అయ్యారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

జీలుగుమిల్లి: గ్రామస్తులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా నిర్మాణాన్ని నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సర్పంచి సున్నం ఉషారాణి ఆదేశించారు. మండలంలోని దర్భగూడెం పంచాయతీ చీమలవారిగూడెం గ్రామంలో మంచి నీటి ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో నీటి ఎద్దడి రాకుండా జలజీవన్ మిషన్ నిధుల నుంచి రూ.33.10 లక్షలను కేటాయించి నూతన వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సర్పంచి సున్నం ఉషారాణి, సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు చేతులమీదుగా బుధవారం శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సున్నం సురేష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వినయ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సువర్ణ పాల్గొన్నారు.

బలివేలో షాపుల వేలంపాట

ముసునూరు: మార్చి 7, 8, 9, 10 తేదీల్లో జరుగు కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా షాపులు నిర్వహించుకునేందుకు వేలంపాట నిర్వహించినట్లు ఆలయ అధికారి ఆకుల కొండలరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బలివే గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆర్‌ఎస్ నెంబరు 104-11 3.03 సెంట్ల ఖాళీ భూమిలో తిరునాళ్లలో భాగంగా వివిధ షాపులు నిర్వహించుకునే వారికి అద్దె వసుళ్ల చేసుకునే విధానంలో అత్యధిక వేలంపాట రూ.13 లక్షలకు హెచ్చు పాట బలివే గ్రామానికి చెందిన పిల్లి రెడ్డియ్య పాడుకోగా, గత సంవత్సరంతో పోల్చుకుంటే రూ.2,50 వేలు అధిక ఆదాయం పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లావు ప్రవీణ సుధాకర్, ఆలయ ఛైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఆలయ అధికారులు, గ్రామ పెద్దలు, పలువురు గ్రామస్తుల సమక్షంలో వేలంపాట నిర్వహించారు.

మానవత ఆధ్వర్యాన విద్యార్థికి సాయం

విద్యార్థికి నగదును అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

భీమడోలు: మానవత ఆధ్వర్యంలో విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పూళ్ల గ్రామానికి చెందిన వ్యవసాయ పాలిటెక్నిక్ డిప్లమా చదువుతున్న విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ పరిపాలన కార్యాలయ భవనానికి సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి ఈనెలలో ప్రారంభోత్సవం చేయనున్నారని సంస్థ శాంతి రథాల విభాగం జిల్లా ఛైర్మన్ అప్పక రాంబాబు తెలిపారు. సంస్థ గత నెలవారీ నిర్వహించిన కార్యకలాపాలపై సమీక్ష భీమడోలులో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు వట్టి సుగుణాకర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎ.రాంబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థికి రూ.15 వేలు ఆర్థిక సాయం చేసి, అనంతరం సమావేశంలో ఫిబ్రవరి నెలలో పేదరికం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న 9 కుటుంబాల వారికి ఆర్థిక సహాయం, నిత్యావసర వస్తువులు, దుస్తులు అందజేసేందుకు నిర్ణయించారు. ఇదే క్రమంలో విద్యలో ప్రతిభ కనబరుస్తున్న ఇద్దరు విద్యార్థులకు సంస్థ తరపున ప్రతిభా పురస్కారం కింద ఒక్కొక్క విద్యార్థికి రూ.25 వేల వంతున అందజేసేందుకు నిర్ణయించారు. ఈ మొత్తాలను సంస్థ జిల్లా విద్యానిధి నుంచి కేటాయించేందుకు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త రామిశెట్టి గంగాధర రావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

మహిళా సంఘం సభ్యులతో ఎంఎల్ఎ

చాట్రాయి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా మహిళా గ్రూపు సభ్యులకు వారి ఖాతాలో జమ చేయడం జరిగిందని నూజివీడు నియోజకవర్గం ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు ఇచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు నవరత్నాల పథకాల ద్వారా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయనను ఓడించటానికి టిడిపి మిత్ర పార్టీలు శత విధాలా ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాని ప్రజలు వారి మాటలు నమ్మి మోసపోయే పరిస్థితులు లేవని తెలిపారు. టిడిపి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకట్లేదని ఎక్కడనుంచో దిగుమతి చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. అనంతరం 1,119 గ్రూపులకు రూ.8 కోట్ల 89 లక్షల చెక్కును పంపిణీ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మహిళా సభ్యులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించగా ఎంపిపి లంక నిర్మల, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేశారు

డిపిఆర్ఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు

ఏలూరు: మల్లేశ్వరి 21 సంవత్సరాలు సమాచార శాఖలో అంకిత భావంతో విధులు నిర్వహించి, అందరి ఆదరాభిమానాలు పొందారని జిల్లా పౌర సంబంధాల అధికారి ఆర్‌విఎస్.రామచంద్రరావు తెలిపారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన మేడిది మల్లేశ్వరిని డిపిఆర్ఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు, సహచర ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. బుధవారం సాయంత్రం స్థానిక డిపిఆర్ఒ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన ఆఫీసు సబార్డినేట్ ఎం.మల్లేశ్వరికి ఆత్మీయ వీడ్కోలు, సత్కారం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ ఆమె సర్వీసులో చేసిన సేవలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కె.ధనుంజయరాజు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

చాట్రాయి: నూజివీడు నియోజకవర్గం మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య సహకారంతో మండల కేంద్రమైన చాట్రాయి గ్రామంలోని చిన్నంపేట కాలనీకి చెందిన యూత్ సభ్యులు కోలేటి హేమంత్, ఆడి మేల్లి శివ, సాదు మధుబాబు, సురేంద్ర, శౌరిలకు క్రికెట్ కిట్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమం గ్రామ మాజీ సర్పంచి కోటా జోషి, గ్రామ పెద్దలు కొప్పుల ప్రసాద్ బాబు, కొమ్ము తామస్ పంపిణీ చేశారు.

రైతులకు పలు సూచనలు

ముదినేపల్లి: ప్రస్తుతం మినుము పంటపై మొక్కల ఎదుగుదలకు, పూతదశలో బలంగా ఉండడానికి గ్రోత్ ప్రమోటర్ ద్రావణం బాగా ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయ మండలి ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ తెలిపారు. మండలంలోని బొమ్మినంపాడు కొత్తహరిజనవాడ కమ్యూనిటీ హాలు వద్ద బుధవారం గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో కోడిగుడ్డు, నిమ్మరసం(గ్రోత్ ప్రమోటర్) ద్రావణం తయారు చేయించడం జరిగింది. ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ మాట్లాడుతూ తయారీ విధానం ఉపయోగాలు ప్రయోగాత్మకంగా చేసి వివరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు అనూష, సుధాకర్, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలతో ముఖాముఖి

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మలతో ముఖాముఖి పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పొదుపు సంఘాల అక్కాచెల్లెమ్మలకు జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంతైతే మేలు జరిగిందో వివరించారు. జగనన్న ఎన్నికల ముందు ఏదైతే హామీ ఇచ్చాడో తుచా తప్పకుండా నెరవేర్చారన్నారు. రాబోయే రోజుల్లో మరింత సంక్షేమ పథకాలు పొందాలంటే మళ్లీ రాష్ట్రంలో వైసిపి జెండా ఎగరాలని కోరారు.

5న 'రా కదలిరా' సభను విజయవంతం చేయాలి

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్న రా కదలిరా కార్యక్రమానికి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అన్నారు. చింతలపూడి పట్టణంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం సభా ప్రాగణాన్ని చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, దెందులూరు నియోజకవర్గం మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, మాజీ ఏలూరు ఎంపీ మాగంటి బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రా కదిలి రా కార్యక్రమానికి చింతలపూడి నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏడు నియోజకవర్గాల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మాజీ ఎంఎల్ఎ గంట మురళీ రామకృష్ణ, చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి, సొంగ రోషన్ కుమార్ పాల్గొన్నారు.

డస్ట్ బిన్‌లు అందజేత

ముదినేపల్లి: గ్రామీణ, పట్టణ, నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించడమే లక్ష్యంగా క్లీన్ ఆంధ్రప్రదేశ్(క్లాప్) జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం జరుగనున్నదని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా ప్రతి ఇంటికి డస్ట్‌బిన్‌లు అందించే కార్యక్రమాన్ని ఆయన మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.మల్లేశ్వరి, ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ పాల్గొన్నారు.

రైతులందరికీ అండగా సొసైటీలు

ముదినేపల్లి: రైతులను అగ్రస్థానంలో నిలబెట్టడం కోసం రైతు భరోసా, ఆర్‌బికెలు, ఇన్పుట్ సబ్సిడీలు వంటి వివిధ రాయితీలతో ప్రతి రైతుకు ఆసరాగా ఉంటూ రైతులకు సహాయకారిగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు నిలుస్తున్నాయని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వైవాకలో రూ.37.50 లక్షల నిధులతో మంజూరై నిర్మాణం చేపట్టబోతున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన భవన శంకుస్థాపన కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గంగిశెట్టి బేబీ సరోజినికి ముఖ్యమంత్రి సహాయక నిధుల నుంచి వచ్చిన రూ.60 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

వీరేశ్వర స్వామి శాంతి కళ్యాణం

పోలవరం: మండల కేంద్రంలో స్థానిక పెద్ద రామాలయం వద్ద బుధవారం పట్టిసీమ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామిల శాంతి కళ్యాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు తెలిపారు.